
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 19 ఫిబ్రవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.146	212	241
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.146	212	241

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.4 । కనిష్ఠం 19.0

సర్కారు ఆస్పత్రికి
అవినీతి జబ్బు



- డీజిల్ వాడినట్లుగా లెక్కలు చూపించి నిధులు స్వాహా
- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

నల్లగొండ/నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 18: ప్రభుత్వాలు వైద్య రంగానికి పెద్ద పీట వేస్తూ నిధులు కేటాయిస్తుండగా, అవి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే అధికారులకు, వైద్యులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొంతమంది సీనియర్ వైద్యులు సొంత క్లినిక్‌లపైనే అధిక దృష్టిపెట్టి ప్రభుత్వాస్పత్రులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులకు శిక్షణ పేరుతో ఆస్పత్రుల్లోని పలు విభాగాల్లో డ్యూటీలు కేటాయించి, వారికి రోగులను చూసే బాధ్యత అప్పగిస్తున్న వైద్యులు సొంత క్లినిక్‌లకు అధిక సమయం కేటాయిస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. మెడికల్ కళాశాల విద్యార్థులకు పూర్తి అవగాహన లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు ఏదో ఒక మందు రాసి పంపిస్తుండటంతో రోగం తగ్గక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కలెక్టర్ లేదా ఉన్నతాధికారి ఎవరైనా తనిఖీకి వస్తున్నారన్నప్పుడు మాత్రమే ఆస్పత్రుల్లోని వార్డులను శుభ్రం చేయడం తప్ప, మిగతా సమయాల్లో వార్డులు కంపు కొడుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్క్రాప్ పేరుతో నిధులు స్వాహా

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇటీవల పాత మంచాలు, టేబుళ్లు, కుర్చీలు ఇతర ఇనుప సామగ్రిని తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని కొనుగోలు చేశారు. అయితే పాత సామగ్రిని ఎలాంటి అనుమతులు లేకుండా ఏకపక్ష నిర్ణయంతో స్క్రాప్ కింద చూపి రూ.12లక్షలకు విక్రయించినట్లు వినికిడి. వీటి ద్వారా వచ్చిన డబ్బును ఆస్పత్రి అభివృద్ధి నిధుల ఖాతాలో జమ చేయకుండా, ఓ అధికారి తన సొంత ఖాతాలో వేసుకున్నట్టు సమాచారం. ఈ విషయం ఇటీవల జరిగిన ఆడిట్‌లో వెలుగు చూడగా, ఓ ప్రజాప్రతినిధి సహకారంతో మేనేజ్ చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. పలు సివిల్ పనుల్లో వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అవినీతికి పాల్పడట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రి కొనుగోలు కమిటీ తీర్మానం లేకుండా 20 ఏసీలను కొనుగోలు చేయడంతో పాటు పాత వాటికి మరమ్మతు చేయించి లక్షల రూపాయల బిల్లులను తన బినామీ అయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఖాతాకు సదరు అధికారి మళ్లించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

డీజిల్ వాడినట్టు చూపి

జనరల్ ఆస్పత్రి పరిధిలో నడిచే ఫుడ్ సప్లయ్ కిచెన్‌తో పాటు రెండు క్యాంటీన్లకు వేర్వేరుగా విద్యుత్ మీటర్లు లేకుండానే ఆస్పత్రి నుంచి విద్యుత్ అందిస్తూ ప్రతీ నెల వారి నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రి అంబులెన్స్‌లకు ఉపయోగించాల్సిన డీజిల్ సైతం తన సొంత వాహనంతో పాటు మెడికల్ కళాశాల అధికారుల వాహనాలకు పోయించి నిధులు దుర్వినియోగం చేసినట్టు సమాచారం. అదేవిధంగా ప్రతీనెల అంబులెన్స్‌లు, జనరేటర్లకు రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు డీజిల్ వినియోగిస్తున్నట్టు లెక్కల్లో చూపుతున్నారు. వాస్తవానికి ఎక్కడా అంబులెన్స్‌లకు అంత మొత్తంలో డీజిల్ పోయించిన దాఖలాలు లేవు. ఆరోగ్యశ్రీ నిధులను సైతం పక్కదారి పట్టించారని, మందులు, ఇతర పరికరాల కొనుగోలుతో పాటు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి నెలనెలా లక్షల రూపాయలు దండుకుంటున్నట్టు ఉద్యోగుల్లో చర్చ కొనసాగుతోంది.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

గత ప్రభుత్వం హయాంలో మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఏజెన్సీల నియామకం, క్యాంటీన్ నిర్వహణ అప్పగింత, ఇతర పరికరాల కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్టు తెలిసింది. మెడికల్ కళాశాలకు చెందిన కొందరు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది హాజరు విషయంలో నెలనెలా డబ్బు దండుకుంటున్నట్టు ఏసీబీ అధికారుల దృష్టికి వెళ్లింది. కలెక్టర్ పలు మార్లు చెప్పినా, కళాశాలలో శానిటేషన్ కాంట్రాక్టర్ టెండర్‌ను పూర్తి చేయలేదు.

మా పని మేం చేసుకుంటూ వెళ్తున్నాం

నేను కొత్తగా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించా. ఆస్పత్రిలో అవినీతి ఆరోపణలపై ఇంకా తనకు ఎలాంటి సమాచారం లేదు. ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్నందున, మా పని మేం చేసుకుంటు వెళ్తున్నాం. రానున్న రోజుల్లో ఆస్పత్రిపై అవినీతి ఆరోపణలు లేకుండా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

నిత్యానంద, నల్లగొండ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

మందుల ధరల్లో
మాయ



- లాభాలొచ్చే కంపెనీల మందులనే రాస్తున్న వైద్యులు
- బయటి దుకాణాల్లో దొరకని వైనం
- తనిఖీలు మమా.. చర్యలు భ్రమ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 18: సగటు మనిషి జీవనశైలి మారి అసంక్రమిత వ్యాధులబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో మెడికల్ వ్యాపారం విరాజిల్లుతోంది. రోగుల అవసరాన్ని బట్టి మెడికల్ దోపిడీ సాగుతుండగా, ప్రైవేట్ ఆస్పత్రులకు అనుసంధానంగా నడిపిస్తున్న మెడికల్ షాపుల్లో నిలువుదోపిడీ జరుగుతోంది. కొందరు వైద్యులు పీడీ డ్రగ్ పద్ధతిని అనుసరించి ఎక్కువ మొత్తంలో లాభాలిచ్చే కంపెనీలకు చెందిన మందులను సిఫారసు చేస్తున్నారు. వైద్యులు సూచించిన మందులు ఆస్పత్రిలో మినహా ఇతర దుకాణాల్లో లభించకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో మెడికల్ మాఫియాదందా జోరుగా సాగుతోంది.

ఆ ఒప్పందంతో..

ఫార్మా కంపెనీలు విస్తృతమైన నేపథ్యంలో ఉత్పత్తులను విక్రయించేందుకు పోటీపడుతున్నాయి. అందుకు వైద్యులను కలిసి కంపెనీ ఉత్పత్తి చేసిన మందులను రోగులకు సిఫారసు చేయాలని కోరుతున్నారు. ఇలా చేయడంలో డాక్టర్లకు, ఆస్పత్రికి చెందిన మెడికల్‌షాపుకు లాభాలు అధికంగా ఇస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు తగ్గేందుకు ఓ ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్ 10రోజులకు రాసిన మందులను అదే ఆస్పత్రిలో కొనుగోలు చేస్తే రూ.800 నుంచి రూ.600 వరకు ఖర్చవుతోంది. ఇదే ఫార్ములా ఉన్న మందులను బహిరంగ దుకాణాల్లో కొనుగోలు చేస్తే రూ.350నుంచి రూ.500కే లభిస్తున్నాయి. వైద్యుల ముందస్తు ఒప్పందంలో భాగంగా సదరు ఫార్మా కంపెనీకి చెందిన మెడికల్ షీట్‌పై ఎమ్మార్పీ ఎక్కువగా ముద్రిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

కనిపించని ఫార్మసిస్టులు

ఔషధ నియంత్రణ మండలి నిబంధనల మేరకు డీ-ఫార్మ, బీ-ఫార్మ కోర్సులు పూర్తిచేసిన వారు మాత్రమే మెడికల్‌షాపుల్లో మందులను విక్రయించాలి. చాలా వరకు ఫార్మసిస్టులు లేకుండానే దుకాణాలు నడుస్తున్నాయి. ఫార్మకోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఏడాదికి కొంత ముట్టజెప్పి కొందరు వ్యాపారులు దుకాణాలు నడిపిస్తున్నారు. మరోవైపు నొప్పులు తగ్గించే స్టెరాయిడ్, పెయిన్‌కిల్లర్స్ ఇష్టానుసారం ప్రజలకు అంటగడుతున్నారు. వీటిని అధికంగా తీసుకోవడంతో కిడ్నీ, గుండె సంబంధిత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను ప్రజలకు అంటగడుతున్నప్పటికీ నియంత్రణ తీసుకునేవారు కరువయ్యారు. కొందరు వ్యాపారులు చర్మసౌందర్యాన్ని పెంచుకునేందుకు కొన్ని కంపెనీల క్రీమ్‌లను బహిరంగానే విక్రయిస్తున్నారు. ఈ తరహా క్రీమ్‌లను గత నెలలో మిర్యాలగూడ పట్టణంలో డ్రగ్ నియంత్రణ అధికారులు పట్టుకొని సీజ్‌చేశారు. వీటివాడకంతో శరీరం సహజత్వాన్ని కోల్పోయి చర్మ సంబంధిత జబ్బులు వస్తున్నట్లు డ్రగ్ కంట్రోల్ బోర్డు నిర్ధారించి నిషేధం విధించినా విక్రయాలు సాగుతూనే ఉన్నాయి. ఇక ఆర్‌ఎంపీలు ఒకటి రెండు నెలల్లో గడువు పూర్తయ్యే మాత్రలు, శ్యాంపిల్స్‌ను ప్రజలకు అంటగడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

తనిఖీల జాడేదీ?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2,980 మెడికల్‌షాపులు, 1,800కుపైగా మెడికల్ ఏజెన్సీలు ఉన్నాయి. నిర్వాహకులు కొనుగోలుదారుడికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్న నిబంధన రాష్ట్ర ఔషధ నియంత్రణమండలి విధించినా క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదు. కొన్ని దుకాణాల్లో నిషేధిత మందులు, క్రీమ్‌ల విక్రయాలు జరుగుతున్నా నియంత్రించలేకపోతున్నారు. ప్రతీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నెలలో కనీసం 25 దుకాణాలను తనిఖీ చేసి నివేదికను ప్రత్యేక యాప్‌లో పొందుపర్చాలి. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి తనిఖీలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. ఫిర్యాదులొచ్చిన సందర్భాల్లో మాత్రమే తనిఖీలు చేసి ఆ తరువాత చర్యలను మరుగునపడేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థాయినిబట్టి కొంతమందికి నెలవారీ ఆదాయం అందుతున్న నేపథ్యంలో మెడికల్ దందాకు వెన్నుదన్నుగా నిలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తనిఖీలు ముమ్మరం చేశాం

మెడికల్ షాపుల్లో అక్రమాలను నియంత్రించేందుకు తనిఖీలు ముమ్మరం చేశాం. ప్రతినెలా దుకాణాల్లోని స్టాక్‌ను పరిశీలిస్తున్నాం. మెడికల్‌షీట్లపై ముద్రించిన ఎమ్మార్పీ మేరకు విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. నిషేధిత మందులను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. ఈ తరహాలో ఇప్పటికే నాలుగు కేసులు నమోదయ్యాయి.

సోమేష్, నల్లగొండ జిల్లా డ్రగ్ఇన్‌స్పెక్టర్

వైద్యుల కొరతతో ఇక్కట్లు



అత్యవసర వైద్యానికి రిఫర్ చేస్తున్న వైద్యులు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 18: హుజూర్‌నగర్ పట్టణంలో పేరుకే అది పెద్దాస్పత్రి.. నేడు ఈ ఆస్పత్రి సమస్యలతో కుస్తీ పడుతుంది. 100 పడకల ఆస్పత్రిలో సగం డాక్టర్లు కూడా అందుబాటులో లేరు. ఉన్న డాక్టర్లకు తీరిక లేకుండా పోయింది. ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సదుపాయాలు అందడంలేదు. అత్యవసర పరిస్థితులు, ప్రమాద బాధితులు వస్తే ఛలో సూర్యాపేట అంటూ రెఫర్ చేస్తున్నారు. కొంతమంది డ్యూటీ డాక్టర్లు సమయానికి రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇక సిబ్బంది రోగులను అసభ్యంగా దూషిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక నర్సులు, కాంపౌండర్ల పరిస్థితి యథారాజా.. తథా ప్రజా అన్న చందంగా మారిందన్న విమర్శలున్నాయి. ఇటీవల ముగ్గురు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర రావులు వచ్చినా ఉద్యోగుల్లో ఎలాంటి మార్పు రాలేదు. మొక్కుబడిగా సేవలందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక 51మంది వైద్యులు ఉండాల్సిన ఏరియా ఆస్పత్రిలో కేవలం 16మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

ఏరియా ఆస్పత్రిని పరిశీలించిన మంత్రులు

ఇటీవల మంత్రులు ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఏరియా ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగుల నుంచి అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది మాత్రం అసలు ఆస్పత్రి అభివృద్ధికి ఎన్ని నిధులు కావాలో కూడా అడగలేని స్థితిలో ఉన్నారు. ఆ సమ యంలో మంత్రి ఉత్తమ్ జోక్యం చేసుకుని సీటీ స్కాన్, డాక్టర్ల కొరత, బిల్డింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. కానీ ఆస్పత్రిలో ఉన్న డాక్టర్లు రోగులకు ఏం కావాలో కూడా చెప్పలేని పరిస్థితి. ముఖ్యంగా ఆస్పత్రిలో ఎండా కాలం వస్తే నీటి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నీటి కొరతతో వేసవిలో సక్రమంగా కిడ్నీ రోగులకు డయాలసిస్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

డాక్టర్ పోస్టుల ఖాళీల ఇలా..

గైనకాలజిస్టులు 6 పోస్టులకు 3 ఖాళీగా ఉన్నాయి. అనస్తీషియా వైద్యులు ఆరుగురు ఉండాల్సి ఉండగా నాలుగు ఖాళీగా ఉన్నాయి. రేడియాలజిస్ట్‌లు మూడు ఖాళీగా ఉన్నాయి. పిల్లల డాక్టర్లు పోస్టులు 3, జనరల్ సర్జన్ 4, జనరల్ ఫిజీషియన్ మొత్తం పోస్టులు 4 ఖాళీగా ఉన్నాయి. ఆర్థోపెడిక్ 2 ఖాళీగా ఉన్నాయి. నేత్ర వైద్యులు 2, ఈఎన్‌టీ 2 , పాథాలజిస్ట్-1, మానసిక వైద్యుడు-1 పోస్టు ఖాళీగా ఉన్నాయి. స్కిన్ డాక్టర్ పోస్టులు 2 ఖాళీగా ఉన్నాయి. మొత్తం 51 పోస్టులకు 16 మంది డాక్టర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు ఆస్పత్రికి 400 నుంచి 500 మంది ఔట్ పేషెంట్లు వస్తూ ఉంటారు. ఇన్‌పేషెంట్లు 60 మంది చికిత్స పొందుతున్నారు.

ఖాళీ పోస్టుల వివరాలు ప్రభుత్వానికి నివేదించాం

ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. చాలా ఏళ్లుగా 35 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 51 మంది డాక్టర్లకు 16 మందే ఉన్నారు. విషయాన్ని ఇటీవల ముగ్గురు మంత్రుల పర్యటన సందర్భంగా వివరించాం.

డాక్టర్ కరుణ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

కాంగ్రెస్‌లో చెలమల్ల రగడ



- ఆయన చేరికపై దుమారం
- అధికారికం కాదంటున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- పార్టీకి సంబంధం లేదన్న ఇద్దరు డీసీసీ అధ్యక్షులు
- ఎలాంటి ప్రకటన చేయని పీసీసీ, ఏఐసీసీ
- మధ్యేమార్గ నిర్ణయం ఉంటుందనే అభిప్రాయం

నల్లగొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మునుగోడు నియోజకవర్గ నేత చెలమల్ల కృష్ణారెడ్డి చేరిక వ్యవహారం కాంగ్రెస్‌లో రాజకీయ దుమారం రేపుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నల్లగొండ, యాదాద్రి జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు చెలమల్ల చేరిక అధికారికం కాదని ఖండించారు. కృష్ణారెడ్డి మాత్రం ఈ ప్రకటనలకు స్పందించకుండా అంతర్గతంగా తన అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో చెలమల్ల కృష్ణారెడ్డికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ పార్టీ కండువా కప్పారు. అయితే చెలమల్ల చేరికను మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఆయన వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకిస్తుండడంతో ఈ వ్యవహారం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో దుమారం రేపింది. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అదే రోజు చెలమల్ల అధికారికంగా చేరలేదని, దీపాదాస్ మున్షీని కలిసి చేరేందుకు సుముఖత మాత్రమే వ్యక్తం చేశారని ప్రకటించారు. శనివారం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. దీపాదాస్ మున్షీకి తెలియకుండా వెళ్లి, దొంగచాటుగా కండువా కప్పించుకున్నారని ఆరోపించారు. తనపై పోటీ చేసిన వ్యక్తి, తనకు తెలియకుండా పార్టీలో ఎలా చేరుతారని ప్రశ్నించారు. కృష్ణారెడ్డి లాంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరారని పేర్కొన్నారు. మరోవైపు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి సైతం చలమల్ల చేరిక అధికారికం కాదని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎవ్వరికీ, ఎలాంటి సమాచారం లేకుండా చేరినందున ఆయన చేరిక చెల్లదని అన్నారు. సీఎం, ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలను దుర్భాషలాడిన వ్యక్తి అని, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీలో చేరి పనిచేశారని విమర్శిస్తే, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సైతం చలమల్లచేరికను ఖండించారు. మరో వైపు చల్లమల మాత్రం వీటికి స్పందించకుండా, తన అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ రగడ మొదలవడంతో ఉమ్మడి జిల్లా శ్రేణుల్లో మాత్రం ఈ వ్యవహారం ఎటు దారితీస్తుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. కోమటిరెడ్డి సోదరుల వర్గీయులు, చలమల్లని పార్టీలో చేర్చుకునేదే లేదని ప్రకటిస్తుంటే, అధిష్ఠానం ఈ వ్యవహారాన్ని ఎలా ముగిస్తుందన్నే అంశంపై అందరిలో ఆసక్తి నెలకొంది.

మునుగోడుకు దూరంగా ఉంచుతారనే చర్చ

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో ఉన్న సమయంలో చెలమల్ల కృష్ణారెడ్డి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆ సమయంలో వచ్చిన ఉప ఎన్నికలో కృష్ణారెడ్డి మునుగోడు టికెట్ ఆశించినప్పటికీ అవకాశం దక్కలేదు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల నాటికి రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకే టికెట్ ఇవ్వడంతో చెలమల్ల బీజేపీలో చేరి పోటీ చేశారు. తాజాగా, ఆయన మళ్లీ శుక్రవారం దీపాదాస్ మున్షీని కలిసి కాంగ్రెస్ కండువాకప్పుకోవడంపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహా ఇతర నేతలు ఖండిస్తున్నారు. త్వరలో ఈ వివాదం ముగుస్తుందని పార్టీ నేతలు, కార్యకర్తలు పేర్కొంటున్నారు. మునుగోడు నియోజకవర్గ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఉండే షరతులతో కృష్ణారెడ్డి చేరికను అధికారికం చేస్తారని చెబుతున్నారు. అధిష్ఠానం మధ్యే మార్గంగా ఏదైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని, అందువల్లే ఇప్పటివరకు ఈ వ్యవహారంపై డీసీసీల నుంచే తప్ప ఇటు పీసీసీ నుంచి గానీ, అటు ఏఐసీసీ నుంచి గానీ ఎలాంటి ప్రకటన రాలేదని చర్చ జరుగుతోంది. అధిష్ఠానం సూచించే ఫార్ములాకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఆయన వర్గీయులు, కృష్ణారెడ్డి ఏ మేరకు అంగీకరిస్తారో అనే అంశంపైనే అందరి దృష్టి నెలకొంది.

కులగణనతో బీసీలకు న్యాయం

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న జక్కలి ఐలయ్యయాదవ్

మర్రిగూడ, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంతో బీసీలకు న్యాయం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో కులగణన బిల్లు ఆమోదింపజేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 76 సంవత్సరాల్లో కులగణన చేయకపోవడంతో న్యాయబద్ధంగా రావాల్సిన నిధులు, నియామకాలు, రిజర్వేషన్లలో బీసీలు అన్ని రంగాలలో నష్టపోయారని చెప్పారు. కులాల లెక్కింపుతో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా, రాజకీయంగా, ఉద్యోగపరంగా ఎదగాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సకల జనుల సర్వే చేసి వివరాలు బయట పెట్టలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 33శాతం నుంచి 23శాతానికి గత కేసీఆర్ ప్రభుత్వం తగ్గించిందని కులగణనతో 42శాతానికి ఈ ప్రభుత్వం పెంచే అవకాశం ఉందన్నారు. సమావేశంలో పార్టీ మం డల అధ్యక్షుడు దోమల వెంకటయ్య, నాయకులు ముద్దం శ్రీనివాస్‌గౌడ్, పగడాల లింగయ్య, పుష్పాల యాదయ్య, కాసార్ల అంజయ్య, శ్రీను, మల్లేష్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీ రామలింగేశ్వరులకు శేషవాహన సేవ

- నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పార్వతీ రామలింగేశ్వరులకు శేషవాహన సేవ నిర్వహిస్తున్న అర్చక స్వాములు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 18: మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పార్వతీ పరమేశ్వరులకు శేష వాహన సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై ఉత్సవమూర్తులను ఉంచి మహామండపం నుంచి మంగళవాయిద్యాల నడుమ ఆలయ వీధుల్లో ఊరేగించారు. నవదంపతులైన పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులు శేషవాహనంపై ఆసీనులై విహరిస్తుండగా వాహనసేవలో పాల్గొనేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉత్సవ విశేషాల్లో ఒకటైన శేషవాహన సేవ వృత్తాంతాన్ని ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ, సురేశ్ శర్మ, సతీశ్ శర్మ, నాగభూషణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ, ఫిబ్రవరి 18: దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేసి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. దేవరకొండ వెనుకబడిన ప్రాంతంకావడంతో ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరగా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థినుల మృతిపై జ్యుడిషియల్ విచారణ జరిపించాలి

● భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో భవ్య, వైష్ణవి మృతిపై అనుమానాలు

● భవ్య, వైష్ణవి న్యాయ పోరాట కమిటీ

పంజాగుట్ట, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో భవ్య, వైష్ణవి మృతిపై అనుమానాలు ఉన్నాయని, వారు ఆత్మహత్య చేసుకునేంత పిరికి వారు కాదని భవ్య, వైష్ణవి న్యాయ పోరాట కమిటీ సభ్యులు అన్నారు. మహిళా, ప్రజా సంఘాల నాయకులు, భవ్య తల్లిదండ్రులు లలిత, కృష్ణ, బాబాయి శ్రీధర్, సోదరుడు గోపి, వైష్ణవి తండ్రి నాగరాజు, నానమ్మ, తాతయ్య సరోజన, సత్తయ్య, బాబాయి అనిల్, తదితరులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థినులు భవ్య, వైష్ణవి మరణాలపై జ్యుడిషియల్ విచారణ జరిపి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులపై లైంగిక దాడిచేసి హత్య చేశారన్న అనుమానం ఉందని ఆరోపించారు. ఈ ఘటనకు సీఎం బాధ్యత వహించాలని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాజీనామా చేయాలన్నారు. మృతుల ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం, పక్కా ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతదేహాలపై సిగరెట్లతో కాల్చిన గుర్తులు, గాట్లు ఉన్నాయన్నారు. సూసైడ్ నోట్‌లో ఉన్న రాత వారిది కాదన్నారు. వార్డెన్ శైలజారెడ్డి, ఆటో డ్రైవర్ ఆంజనేయులును అదుపులోకి తీసుకొని విచారిస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. పూర్తిగా విచారణ చేయకుండానే ఆత్మహత్య చేసుకున్నారని భువనగిరి సీఐ ఎలా చెప్తారని ప్రశ్నించారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చైతన్య మహిళా సంఘం ప్రతినిధి జ్యోతి హెచ్చరించారు. సమావేశంలో వివిధ సంఘాలు నాయకులు వాసు కె.యాదవ్, స్వరూప, వరలక్ష్మి, రాజా రామ్‌యాదవ్, లక్ష్మి, మధు యాదవ్, పరీక్షన్‌రాజ్, శ్రీనివాస్, చామకూర రాజు, మేకల కృష్ణ, విజయ్ మోహన్, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం ఉంటుందని వారు ప్రకటించారు.


సమావేశంలో మాట్లాడుతున్న భవ్య తండ్రి కృష్ణ

మేడారానికి వెళుతూ గుండెపోటుతో మృతి


పిచ్చయ్య(ఫైల్)

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 18: ములుగు జిల్లాలోని సమ్మక్క, సారక్క మేడారం జాతరకు మొక్కులు చెల్లించేందుకు వెళుతున్న వ్యక్తి మార్గమధ్యంలో గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన బాలాజీ రైస్‌మిల్లు డ్రైవర్ దడిగె పిచ్చయ్య (56) ఆదివారం తెల్లవారు జామున తోటి డ్రైవర్లతో కలిసి ఏడుగురు నాలుగు మోటార్ సైకిళ్ళపై మేడారం జాతరకు బయలుదేరారు. ఖమ్మం జిల్లా ఈశ్వరమాధారం శివారులోని బ్రిడ్జి వద్దకు చేరుకోగానే పిచ్చయ్య గుండె పోటుతో మృతి చెందాడు. కాగా వెంటనే అతన్ని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికికే పిచ్చయ్య మృతి చెందినట్లు స్నేహితులు తెలిపారు. దీంతో వెంటనే మృతదేహాన్ని స్వగ్రామమైన హుజూర్‌నగర్‌కు తరలించారు. సాయంత్రం పట్టణంలో పిచ్చయ్య మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా పిచ్చయ్య పట్టణంలో 30 యేళ్ళుగా రైస్‌మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా పిచ్చయ్య మృతి ఐఎన్‌టీయూసి సంఘానికి తీరని లోటని ఐఎన్‌టీయూసి జిల్లా కార్యదర్శి చింతకాయలరాము, బీఆర్‌ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్‌యాదవ్, రైస్‌మిల్లు డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు జానయ్య, మల్లయ్య సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.


గుప్తనిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలు జరిపిన ప్రాంతం

చిలుకూరు, ఫిబ్రవరి 18: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దూద్యాతండాలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. దూద్యాతండా గ్రామశివారులో ఓ రైతు పొలంలో పురాతన ఆంజనేయ స్వామి దేవాలయం ఉంది. ఆ ఆలయం అడుగున గుప్తనిధులు ఉన్నట్లుగా భావించి శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. ఆ ప్రదేశంలో క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు, తవ్వకాలు చేపట్టినట్లు కన్పించాయి. తవ్వకాలు జరిపిన ప్రదేశంలో బంగారం దొరికినట్లు గ్రామంలో పుకార్లు వినిపిస్తున్నాయి. ఈ విషయమై పోలీసులు విచారణ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మానసిక వేదనతో యువకుడి ఆత్మహత్య


హుజూర్‌నగర్, ఫిబ్రవరి 18: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని గోవిందపురంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. స్థానిక ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందపురానికి చెందిన కామళ్ల గోపి (32) వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్ది రోజుల నుంచి వ్యక్తిగత విషయాలను మనసులో పెట్టుకొని మానసిక వేదనతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. గోపి తండ్రి సుందర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపా రు.













సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే (ఫైల్)

రేషన్ బియ్యం బుక్కేస్తున్నారు

● తినేవారు తక్కువ.. అక్రమ వ్యాపారులు ఎక్కువ ● పాలిష్‌తో సన్న రకాల్లో మిళితం.. కోళ్లఫాంలు, హోటళ్లకు తరలింపు ● అంతా అధికారుల కనుసన్నల్లోనే ● సూర్యాపేట జిల్లాలో జోరుగా వ్యాపారం

సూర్యాపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో రేషన్ బియ్యం తినేవారు తక్కువ.. అక్రమ వ్యాపారులు ఎక్కువ అనే తీరుగా మారింది. కొంతమంది వ్యాపారులు ఇదే వృత్తిగా చేసుకొని దందాను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులతోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి రేషన్ బియ్యం వస్తుందని అధికారులు చెబుతున్నా వాస్తవానికి జిల్లాలోని అన్ని మండలాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసే వ్యాపారులు ఉన్నారు. రేషన్ బియ్యాన్ని ఆటోల్లో తరలిస్తూ ఒక ప్రాంతంలో నిల్వచేసి లారీలు, డీసీఎం వాహనాల్లో కాకినాడ సమీపంలోని యానాం, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులుకు, పోలీసులకు అక్రమార్కులు మామూళ్లు ఇస్తూ తనిఖీలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో అడపాదడపా మాత్రమే నిల్వలు పట్టుబడుతున్నాయి.

కోళ్లు, పశువుల దాణా కోసమే..

కిలో రూపాయికి ఇస్తున్న రేషన్ బియ్యాన్ని సూర్యాపేట జిల్లాలో 90శాతం ప్రజలు తీసుకోవడంలేదు. గొర్రెలు, నాటు కోళ్లు, పశువులు ఉన్న వారు మాత్రమే దాణాకోసం తీసుకుంటున్నారు. మిగిలిన వారికి కిలో బియ్యానికి రూ.8నుంచి రూ.10లు డీలర్లు చెల్లిస్తూ తమవద్దే నిల్వ ఉంచుతున్నారు. సన్నరకాల బియ్యం దిగుబడి తక్కువగా ఉండడంతో రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంలో కలుపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒక ఆటో లోడుకు సరిపడా బస్తాలు ఉన్నప్పుడు హోల్‌సేల్ బియ్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. అధికారులు అప్పుడప్పుడు మాత్రం కేసులు నమోదు చేస్తూ తాము నిజాయితీగా పనిచేస్తున్నట్లు భ్రమలు కల్పిస్తున్నారని జిల్లాలో చర్చసాగుతోంది.

ఖమ్మం టూ హైదరాబాద్

సూర్యాపేట పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులతో కలిసి మూడు రోజుల క్రితం చివ్వెంల మండలం చందుపట్ల వద్ద ఒక లారీని పట్టుకున్నారు. ఆ లారీలో 20 టన్నుల ప్రభుత్వ రేషన్ బియ్యం ఉండడంతో కూపీ లాగారు. ఖమ్మం జిల్లా కూసుమంచి గ్రామంనుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా షేక్‌మీరాఅలీకి చెందిన మూడు వాహనాల్లో 10టన్నుల రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయి. తరలించడానికి సిద్ధంగా ఉన్న ఆ వాహనాలను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిత్యావసర వస్తువుల దుర్వినియోగ చట్టం, చీటింగ్ చట్టం కింద కేసు నమోదుచేసి నలుగురు నిందితులను అరెస్టుచేశారు. ఇదిలా ఉండగా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో ఇద్దరు వ్యక్తులు రేషన్ బియ్యం నిల్వ చేయడంతో ఆ ఇద్దరి గురువారం అరెస్టుచేసి 95క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మూడు రోజుల వ్యవధిలో రూ.14లక్షల విలువైన 395 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.

ఆధునిక పద్ధతులు ఉన్నా ఆగని దందా

ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్(ఈ-పోస్) ద్వారా రేషన్ తీసుకోని కార్డుదారుల సరుకులు నల్లబజార్‌కు తరలకుండా కొద్దిమేర అడ్డుకట్ట వేయగలిగారు. ఆ తర్వాత షరా మాములుగా మారింది. కార్డుదారులు తీసుకునే బియ్యం మాత్రం డీలర్‌కు చేరుతుండగా, దళారుల దందాతో బియ్యం జిల్లాను దాటుతోంది. గతంలో ఈ-పోస్ లేకముందు కార్డుదారులు తీసుకోకున్నా తీసుకున్నట్లు రికార్డులో నమోదుచేసి బియ్యాన్ని డీలర్లు మిగుల్చుకుని మిల్లులకు, దళారులకు విక్రయించేవారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ప్రజలు తీసుకోని బియ్యం మళ్లీ ప్రభుత్వానికి చేరుతుండగా, తీసుకునేవారు మాత్రం గరిష్ఠంగా డీలర్లకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రూపాయికి కిలో బియ్యం ఇస్తుండగా, అవే బియ్యాన్ని అక్కడే తూకం వేసి కిలో రూ.8నుంచి రూ.10 వరకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యాన్ని పలువురు డీలర్లు టిఫిన్ సెంటర్లు, పాడి పరిశ్రమలు, తినుబండారాలు తయారు చేసే కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల, మఠంపల్లి మండలాల్లో ఎక్కువగా ఉండేవారు. తాజాగా కోదాడ నియోజకవర్గంలోని కూచిపూడికి చెందిన నర్సింహారావుపై పోలీసులు పీడీ యాక్టు నమోదు చేశారు.



నడిగూడెం-ఖమ్మం సరిహద్దులో డంప్ చేసిన బియ్యం

వ్యాపారుల్లో మారిన పంథా

పలువురు డీలర్లు కిలో రేషన్ బియ్యాన్ని రూ.8నుంచి రూ.10కి కొనుగోలు చేస్తున్నారు. వాటిని అనువైన సమయంలో బియ్యం దందా చేసే వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో బియ్యం ఉంటే కాకినాడ, యానాంకు తరలిస్తున్నారు. గతంలో రేషన్ బియ్యం అక్రమ సరఫరాకు సూర్యాపేట జిల్లా కేంద్రం, చివ్వెంల మండలం కుడకుడ అడ్డాగా ఉండేవి. అయితే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, పౌరసరఫరాల విజిలెన్స్ అధికారులు, పోలీసులు, వాణిజ్య పన్నులశాఖ అధికారులు కూడా దాడులు ముమ్మరం చేయడంతో పట్టణాల్లో తగ్గించి పల్లెల్లో అడ్డాగా చేసుకుని బియ్యాన్ని నిల్వ ఉంచుతున్నారు.

జిల్లాల్లో సరుకుల పంపిణీ ఇలా..

సూర్యాపేట జిల్లాలో 609 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో 2,87,574 ఆహార భద్రత కార్డులుండగా, 18,816 అంత్యోదయ కార్డులు, 50 అన్నపూర్ణ కార్డులున్నాయి. ఈ లబ్ధిదారులకు ప్రభుత్వం నెలకు 5,951 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తోంది. సంవత్సరానికి 71,412 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతోంది.

80 శాతం పక్కదారి..

సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వం నుంచి సరఫరా అయిన బియ్యంలో 80శాతం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. సంవత్సరానికి 71,412 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతుండగా.. సుమారు 57,129 క్వింటాళ్ల వరకు పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇందులో పట్టుబడుతున్న బియ్యం మాత్రం కొంతే ఉందని తెలుస్తోంది. అధికారుల తనిఖీలు చేసే విషయాలు ముందస్తుగా వ్యాపారులకు తెలుస్తుండడంతో జాగ్రత్తలు పడుతున్నారు. పోలీస్, పౌరసరఫరాల శాఖలోని అధికారులతో అంటకాగుతున్న వ్యక్తులతో గల సంబంధాలతో ఈ సమాచారం చేరుతోందన్న ఆరోపణలున్నాయి. ఈ సంవత్సరంలోనే 685.300 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.28లక్షలుగా అధికారుల అంచనా. ఏడాదిలో 14 కేసులు నమోదు చేసి 22మందిని అరెస్టు చేశారు. ఇందులో భాగంగా 8వాహనాలను సీజ్ చేశారు. అయితే పట్టుబడిన బియాన్ని వేలంవేసి, విక్రయిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం

అనుమానం వచ్చిన రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. బియ్యం ఇచ్చే సమయంలో రేషన్ దుకాణాలను సందర్శించాలని టాస్క్‌ఫోర్స్, ఆర్ఐ, డీటీలకు సూచించాం. బియ్యానికి బదులు నగదు పంపిణీ చేసినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

మోహన్‌బాబు, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి, సూర్యాపేట

కోదాడ అడ్డాగా రేషన్ దందా

● అక్రమార్కులకు పలువురు అధికారుల సహకారం ?

కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ అడ్డాగా రేషన్ బియ్యం దందా సాగుతోంది. నియోజకవర్గంలో మోతె మండలం మినహా చిలుకూరు, నడిగూడెం, అనంతగిరి, కోదాడ, కోదాడ మండలాలకు బియ్యం సరఫరా కోదాడలోని సివిల్ సప్లయి గోదాంనుంచే జరుగుతుంది. మొత్తం 146 రేషన్‌షాపులకు వెయ్యి మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం సరఫరా అవుతుంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని కొంత మంది కార్డుదారులు వేలిముద్రలువేసి కిలోకు రూ.6నుంచి రూ.8 వరకు డీలర్లకు విక్రయిస్తున్నారు. డీలర్ల నుంచి కొనుగోలు చేసిన దళారులు ఇదే బియ్యాన్ని కిలోకు రూ.22నుంచి రూ.28 వరకు బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

రహస్య ప్రాంతాల్లో డంప్

డీలర్ల వద్ద కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఏ మండలంలోని దళారులు ఆ మండలంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. అనంతగిరి, నడిగూడెం మండలాల్లో సేకరించిన బియ్యాన్ని సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖమ్మం జిల్లాకు తరలించి, అక్కడి నుంచి ఆంధ్రాకు తరలిస్తున్నారు. మునగాల, కోదాడ, చిలుకూరు మండలాల్లో సేకరించిన బియ్యాన్ని ఆయా మండలంలోని రహస్య డంప్‌ల నుంచి లారీల ద్వారా తెలంగాణ చెక్‌పోస్టుకు సరిహద్దుగా ఉన్న జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేటకు తరలిస్తుంటారు. కొంతమంది డీలర్లు దళారులకు కాకుండా రైస్‌మిల్లులకు సైతం విక్రయిస్తున్నట్లు తెలిసింది. మండలంలోని కొమరబండలోని ఓ రైస్‌మిల్లుకు రేషన్ బియ్యాన్ని డీలర్లు అక్రమంగా తరలిస్తుండగా, మిల్లు యజమానితో పాటు డీలర్లపై కూడా గతంలో కేసులు నమోదు చేశారు. నెలకు వెయ్యి మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ షాపులకు సరఫరా అవుతుండగా, అందులో సగానికి పైగా బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నట్లు తెలిసింది.



బియ్యం అక్రమ వ్యాపారాన్ని ఉపేక్షించం

కోదాడ అడ్డాగా బియ్యం అక్రమ వ్యాపారం చేసేవారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదు. పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని అక్రమార్కులు దళారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, ఈ విషయం నా దృష్టికి వచ్చింది. ఇప్పటికే చర్యలు తీసుకోవాలని అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశాం.

● ఉత్తమ్ పద్మావతి, ఎమ్మెల్యే, కోదాడ

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ బోగీలో పొగలు

తిప్పర్తి, ఫిబ్రవరి 18: జన్మభూమి ఎక్స్‌ప్రెస్ బోగీలో ఒక్కసారిగా పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఆదివారం విశాఖపట్నం నుంచి వయా గుంటూరు మీదుగా సికింద్రాబాద్ బయలుదేరింది. సాయంత్రం సుమా రు 5.30 గంటల సమయంలో తిప్పర్తి మండల రైల్వేస్టేషన్ సమీపంలోకి చేరుకోగానే ఎక్స్‌ప్రెస్ రైలు బోగీల్లో పొగలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది రైలును తిప్పర్తిస్టేషన్‌లో నిలిపివేసి తనిఖీ చేశారు. బోగీలకు ఉన్న బ్రేకులు పట్టివేయడంతో రాపిడికి గురై పొగలువ్యాపించినట్లు గుర్తించారు. వెంటనే సిబ్బంది బ్రేక్‌లను సరిచేశారు. తిప్పర్తి రైల్వే స్టేషన్‌లో జన్మభూమి సుమారు పది నిమిషాలు నిలిచింది. అనంతరం రైలు సికింద్రాబాద్‌కు బయలుదేరింది.

గోడ కూలి మహిళ మృతి



పద్మ (ఫైల్‌ఫొటో)

మునగాలరూరల్, ఫిబ్రవరి 18: గోడ కూలి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం గణపవరం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అమరబోయిన పద్మ (45) ఆదివారం ఉదయం వాకిలి శుభ్రం చేస్తోంది. అదే సమయంలో పాత గోడ కూలి ఆమె మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఓ కుమార్తె ఉంది. కాగా పదేళ్ల క్రితమే అనారోగ్యంతో ఆమె భర్త, కుమారుడు మృతి చెందారు.

గుడిపల్లిలో అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 18: రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 34పైగా దొంగతనం కేసులు ఉన్న అంతర్రాష్ట్ర దొంగను ఎట్టకేలకు నల్లగొండ జిల్లా గుడిప ల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.2.50 లక్షల విలువైన ఆభరణాలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటురు జిల్లా నరసరావుపేటకు చెందిన కత్తి రవికుమార్ రాత్రి సమయంలో తాళం వేసిన ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతుండేవాడు. అతనిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 34పైగా దొంగతనం కేసులు నమోదయ్యాయి. గత డిసెంబరులో జైలు నుంచి బయటకు వచ్చి మళ్లీ పాత పంథాను కొనసాగించాడు. ఈ ఏడాది జనవరి 18వ తేదీ రాత్రి మండలంలోని రంగారెడ్డిగూడెం స్టేజీ వద్ద గజ్జెల సుధాకర్‌రెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. అర్ధరాత్రి ఇంటితాళం పగలగొట్టి బీరువా తెరిచి బంగారు వస్తువులు, ఒక సెల్‌ఫోన్, కొంత నగదును దొంగిలించి వెళ్లారని సుధాకర్‌రెడ్డి గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆదివారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అతనిని పట్టుకున్నారు. అతని జేబులో కొంత బంగారం గుర్తించి, విచారించగా అతను చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద ఉన్న మోటార్ సైకిల్ కూడా పెద్దవూర మండలం లింగంపల్లి వద్ద చోరీ చేసి దొంగతనాలకు ఉపయోగిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అతని వద్ద రూ.2.50లక్షల విలువైన ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ ఆధ్వర్యంలో గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, ఐడీ పార్టీ సిబ్బంది హేమూ నాయక్, భాస్కర్, కొండల్ ఇతర సిబ్బంది దర్యాప్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడిన రవికుమార్‌ను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన కొండమల్లేపల్లి సీఐ ధనంజయ్, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, ఇతర పోలీస్ సిబ్బందిని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు

పాతగుట్ట అధ్యయనోత్సవాలు పరిసమాప్తం

● నేటి నుంచి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు ● యాదగిరిక్షేత్రంలో భక్తజనుల పూజల సందడి ● కోలాహలంగా తిరువీధులు..సేవా మండపాలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, యాదగిరికొండపై భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి18: పాతగుట్ట యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మూడు రోజులుగా కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు ఆదివారం రామానుజాచార్యుల అవతరణ, లక్ష్మీనృసింహుడి అలంకార సేవోత్సవ వేడుకలతో పరిసమాప్తమయ్యాయి. ముందుగా పాతగుట్ట ప్రధానమండపంలో నవకలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆచార్యులు ఆళ్వార్లను, ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనాలు జరిపారు. పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో లక్ష్మీనృసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. అలంకారసేవ ముందు అర్చకులు, రుత్వికులు ప్రబంధ పారాయణ పఠనం చేశారు. పరమ భక్తాగ్రేసరుడు నమళ్వార్ పరమపదంచి రామానుజాచార్యులుగా అవతరించి భగవంతుడితోపాటు పూజలందుకునే ఘట్టాలతో అధ్యయనోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. అధ్యయనోత్సవాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు నిర్వహించారు. అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఈ నెల 19వ తేదీ (సోమవారం) ఉదయం 9గంటలకు ఆలయ అర్చకబృందం వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలను శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో శ్రీకారం చుట్టనున్నారు. ప్రతీ ఏడు మాఘ శుద్ధ దశమి నుంచి మాఘ బహుళ పాడ్యమి వరకు సంప్రదాయరీతిలో పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ మేరకు పాతగుట్ట ఆలయాన్ని, స్వాగత తోరణాలు వివిధ రకాల రంగులతో తీర్చిదిద్ది విద్యుద్దీకరణ పనులు పూర్తి చేస్తున్నారు. ప్రధానాలయ రాజగోపురంతో పాటు ఆలయ ముఖద్వారాలను మామిడి, అరటి ఆకులతో అందంగా ముస్తాబు చేస్తున్నారు.

పాతగుట్ట బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయిలా..

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో 19వ తేదీ (సోమవారం ఉదయం) 9గంటలకు విశ్వక్సేనారాధన, స్వస్తివాచన పూజలతో సంప్రదాయరీతిలో ఆరంభిస్తారు. సాయంత్రం అంకురారోపణ, మృత్సంగ్రహణం పూజలు నిర్వహిస్తారు. 20న ధ్వజారోహణం..సాయంత్రం దేవతాహ్వానం.. భేరీపూజ.. హవనం నిర్వహిస్తారు. 21న సింహవాహన అలంకార సేవ..రాత్రికి స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం నిర్వ హిస్తారు. 22న ఉదయం హవన పూజలు, రాత్రి వేళ దేవదేవుడి బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తారు. 23న ఉదయం నిత్య పూజలు, రాత్రి 8గంటలకు దివ్య విమాన రథోత్సవం నిర్వహిస్తారు. 24న యాగశాలలో మహాపూర్ణాహుతి, విష్ణుపుష్కరిణిలో చక్ర తీర్థ స్నానం, సాయంత్రం దేవ తోద్వాసన, శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. 25వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

యాదగిరిక్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.దేవదేవుడి దర్శనాలకు కోసం ఉభయ దర్శన క్యూలైన్లలో బారులు తీరారు. ధర్మదర్శనానికి మూడు గంటలు, వీఐపీ టిక్కెట్ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 30వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.35,52,253 ఆదాయం సమకూరింది. నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. యాదగిరీశుడిని విప్ బీర్ల అయిలయ్య, తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఐఏఎస్ అధికారి ఎ శరత్‌లు వేర్వేరుగా దర్శించుకున్నారు.

క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య




అశోక్ (ఫైల్ ఫొటో)

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 18: క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం రాత్రి నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జానిగాని తండాకు చెందిన రమావత్ కోట్యా, ఝాంకా దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్ద రు కుమార్తెలు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడైన అశోక్ (23) డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాడు. తొమ్మిది నెలల క్రితం హాలియా మండలానికి చెందిన మౌనిక అనే యువతితో వివాహమైంది. ఈ క్రమంలో కుటుంబం గడవ టం కష్టంగా ఉండటంతో తండాకు వచ్చి కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే వివాహానికి ముందు ఉద్యోగం వస్తుందని చెప్పి ఇప్పుడు కూలిపని చేస్తున్నావని మృతుని కుటుంబ సభ్యులు తరచూ అడిగేవారని గ్రామస్థులు తెలిపారు. 15 రోజుల క్రితం ఆమె తల్లిగారింటి వెళ్లింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తండ్రి కోట్యా కూలీ పని మానుకొని ఏదో ఒక ఉద్యోగం చేయాలని గద్దించాడు. దీంతో మనస్తాపానికి గురవడంతో పాటు విసుగు చెందిన యువకుడు కుటుంబ సభ్యులను బెదిరిద్దామని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు అశోక్ భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. అశోక్ మృతదేహానికి ఎమ్మెల్యే బాలునాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వేమన్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నర్సింహారెడ్డి ఉన్నారు.

అధ్వానంగా ఏఎమ్మార్పీ కాల్వలు

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాల్వల్లో కంపచెట్లు పెరిగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంట నగరాలతో పాటు 516 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. అధికారులు గతేడాది మరమ్మతుల కోసం


కంపచెట్లతో నిండిపోయిన ఏఎమ్మార్పీ కాల్వ

రూ.150 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రి కావడంతో ఏఎమ్మార్పీకి నిధులు కేటాయింపు జరుగుతుందని ఆయకట్టు రైతులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రూ.500 కోట్లు కేటాయిస్తే ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలోని కాల్వల మరమ్మతులు పూర్తవుతాయి. 2001లో ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ప్రారంభమైంది. నాలుగు మోటార్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పాటు ప్రాజెక్టు పరిధిలోని 90చెరువులను నింపడమే ప్రాజెక్టు లక్ష్యం. కానీ ప్రాజెక్టు ప్రారంభం నుంచి రెండు పంటలకు సాగునీరు అందించిన సందర్భాలు లేవు. హైదరాబాద్ జంట నగరాలతో పాటు మిషన్‌భగీరథ, జిల్లాలోని చెరువులకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఏఎమ్మార్పీ కాల్వలకు నిధులు కేటాయించి కంపచెట్లు తొలగించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఎమ్మార్పీ డీఈ, నాగయ్యను వివరణ కోరగా కాల్వల మరమ్మతులకు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే మరమ్మతులు చేపడుతామని అన్నారు.

● దేవరకొండ

ఒక్క మొక్క బతికితే ఒట్టు...

చండూరు మునిసిపాలిటీ మునిసిపాలిటీలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. పార్కులో మొక్కలు బతికించడానికి నీరు లేకపోవడంతో రెండు బోర్లు వేసి వాటికి మోటార్లు బిగించి, వాటికి విద్యుత్ సౌకర్యంతో పాటు పార్కు రక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు


చండూరులో మొక్కలు ఎండిపోవడంతో నిరుపయోగంగా పార్కు

చేశారు. మొక్కలకు నీరు అందించేందుకు గాను డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసి వదిలేశారు. మొక్కలను పెంచేందుకు సుమారు రూ. 16 లక్షలు వెచ్చించారు. మునిసిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక్క మొక్క కూడా బతకలేదు. ఈ పార్కును బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కొన్రెడ్డి యాదయ్య ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు. కానీ పనులు పూర్తిచేసినా ప్రభుత్వం నుంచి కేవలం రూ.5లక్షలు మాత్రమే వచ్చాయని, మిగతా డబ్బులు రాలేదని వాపోయారు. ఈ స్థలంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌కు తేడా ఉండటంతో ఆ స్థలం పందులకు ఆవాసంగా మారింది. ఆర్డీవో కార్యాలయం సమీపంలో ఉన్న పార్కులో ఇంత జరుగుతున్నా అధికారులు అటు వైపు చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. స్థలం ఖాళీగా ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం తాగి ఖాళీ సీసాలు అక్కడే పడేస్తున్నారు. పార్కు నిర్వహణ లేకపోవడంతో ఆ స్థలం కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని, ఉన్నతాధికారులు స్పందించి అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకుని పార్కును రక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ వెంకటమణికరణ్‌ను వివరణ కోరగా అక్కడ పార్కు ఉన్న సంగతే తమకు తెలియదని చెప్పడం గమనార్హం.

● చండూరు

రోడ్లపైనే అస్తవ్యస్తంగా పార్కింగ్

కొండమల్లేపల్లి చౌరస్తాలో అధికారులు, పోలీసుల పర్యవేక్షణ కొరవడింది. చిరు దుకాణాలను రోడ్డు పక్కనే ఏర్పాటు చేయడంతో పాటు ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ప్రధానంగా మండల కేంద్రంలోని భవన నిర్మాణదారులు నిబంధనలు తుంగలో తొక్కుతూ పెద్ద


కొండమల్లేపల్లిలో రోడ్డుపైనే అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు

పెద్ద భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో పార్కింగ్ స్థలం లేకపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారింది. దేవరకొండ రోడ్డులో ఉన్న ఓ బ్యాంకు అధికారులు, వినియోగదారులు, పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ నెలకొంటుంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే వాహనదారులు పార్కింగ్ చేయాల్సిన స్థలంలో అక్కడి బ్యాంకు బిల్డింగ్ యజమాని కక్కుర్తిపడి పాన్ డబ్బాలకు, హోటల్, చిరు దుకాణదారులకు కిరాయికి ఇచ్చారు. దీంతో ఆయా దుకాణ సముదాయాల వద్ద ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. వాహనాలను రోడ్లపైన పార్కింగ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ వీరబాబును వివరణ కోరగా ట్రాఫిక్ సమస్య ఉండటంతో బ్యాంకు అధికారులకు సెక్యూరిటీని నియమించుకోవాలని సూచించారు. కాని ఎలాంటి స్పందన రాలేదు. గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి కూడా తీసుకెళ్లాం. పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

● కొండమల్లేపల్లి

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్ద అడిశర్లపల్లి, ఫిబ్రవరి 18: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని బాలాజీనగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ప్రజలందరూ కులమతాలకతీతంగా పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మిక చింతనను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్‌లీడర్ అలుగుబెల్లి శోభారాణిపవిరెడ్డి, దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, పీఏసీఎస్ చైర్మన్‌లు జాలె నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, తేరా మణిపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ముక్కమల్ల వెంకటయ్య, మైనార్టీసెల్ అధ్యక్షుడు సిరాజ్‌ఖాన్, వంగాల వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి, ఎల్లేష్, సంగునాయక్, శ్రీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

నెల్లిబండలో బొడ్రాయి ప్రతిష్ఠాపన


బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

నకిరేకల్, ఫిబ్రవరి 18: నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామంలో శీతల పరమేశ్వరి బొడ్రాయి సహిత ముత్యాలమ్మ, కోట మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగిన బొడ్రాయి పండుగ మహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి పండుగకు బంధువులు అధికసంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామంలో ప్రతిష్ఠించిన బొడ్రాయి, ముత్యాలమ్మ విగ్రహాలకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు యానాల కృష్ణారెడ్డి, యానాల మధుసూదన్‌రెడ్డి, యానాల శ్రీనివాస్‌రెడ్డి, యానాల యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నల్లగొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి 18: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహబంధాలు పెంపొందుతాయని నల్లగొండ డీఎస్పీ పి.శివరాంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన మాని స్టార్ జట్టు ప్రథమ, జానీ లెవల్ టీమ్‌కు ద్వితీయ బహుమతులను డీఎస్పీ అందజేసి మాట్లాడారు. ఆటల పోటీల్లో క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వంగాల అనిల్‌రెడ్డి, ఆమంచి రాజలింగం, ఆర్గనైజర్ ఏర్పుల శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠినచర్యలు


గుంటిపల్లి స్టేజీ వద్ద పట్టుకున్న పీడీఎస్ బియ్యం

చందంపేట, ఫిబ్రవరి 18: పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్‌వో వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చందంపేట మండలం గుంటిపల్లి వద్ద ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణాపై సమాచారం ఉంటే సెల్ 9848849126 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న వారిలో దేవరకొండ, మిర్యాలగూడ, నల్లగొండ, పెద్దవూర డీటీసీఎస్ సిబ్బంది హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, జావిద్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల భయం పోయేందుకు టెస్టులు దోహదం

● నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 18: విద్యార్థుల్లో పరీక్షలు అంటే భయాన్ని తొలగించేందుకు టాలెంట్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని డీఎస్పీ కె.శివరాంరెడ్డి అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి డీఎస్పీ శివరాంరెడ్డి హాజరై ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. టాలెంట్ టెస్టులను సద్వినియోగం చేసుకొని తద్వారా విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలని సూచించారు. విద్యార్థి సంఘాలు విద్యార్థుల సమస్యలపై పోరాడటమే కాకుండా ఇలాంటి ప్రతిభా పరీక్షలు నిర్వహించడం హర్షనీయమన్నారు. విద్యార్థులందరూ శ్రమించి చదివితే విజయం అనేది బానిసవుతుందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గుట్కా, పాను ఇలాంటి చెడు అలవాట్లను దరిచేరనీయకుండా మంచి క్రమశిక్షణ భావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య, రాష్ట్ర గర్ల్స్ కమిటీ సభ్యురాలు స్పందన, శిరీష, శ్రీధర్, కల్పన, రాధిక, అంజలి, బిందు, మాధవి, దేవి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే...

దేవరకొండ: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి భయాన్ని తగ్గించేందుకు ఎస్‌ఎఫ్‌ఐ టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ అన్నారు. దేవరకొండలో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా


నల్లగొండలో టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

వ్యాప్తంగా పట్టణ, మండలస్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి అధునాతన కాలంలో విద్యార్థులు వారి మేధోశక్తిని పోటీ ప్రపంచానికి అనుగుణంగా పెంపొందించుకోవాలని, విజ్ఞానవంతులుగా, మేధావులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **కొండమల్లేపల్లి:** విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టులు ఉపయోగపడుతాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టును నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బుడిగ వెంకటేశ్, స్పందన, అంజలి, అంకిత, రాము, దేవరాజ్ పాల్గొన్నారు.

● **దామరచర్ల:** ప్రతిభా పరీక్షల్లో విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని వాడపల్లి ఎస్‌ఐ రవికుమార్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఎస్‌ఐ రవికుమార్ పాల్గొని ప్రశ్నపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల భయాన్ని పోగొట్టడానికి ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహిస్తున్న ప్రతిభ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణ సాధించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్, నాయకులు శ్రీనునాయక్, వినోద్‌నాయక్, పాపానాయక్, దయానంద్, బాలు, చంద్రశేఖర్, సత్యనారాయణ, సందీప్, చిరు, పవన్, నరసింహ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దామరచర్లలో ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎస్‌ఐ రవికుమార్

దేవాలయానికి మంత్రి రూ.10లక్షల విరాళం

● ఆలయకమిటీకి అందజేసిన నాయకులు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 18: పట్టణంలోని పాతబస్తీలో చేపడుతున్న అభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.10లక్షల విరాళం అందజేశారు. మంత్రి పంపించిన రూ.10 లక్షలను ఆదివారం క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఇటీవల ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి ఆలయ నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆదివారం రూ.10లక్షలు అందజేశారు. కాగా దేవాలయంలో ప్రతిష్ఠించిన 18 అడుగుల విగ్రహాన్ని కూడా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డినే ఇప్పించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ భైరగోని రాజయ్య, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆలయానికి విరాళం అందచేస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బీసీ భవనాన్ని ప్రారంభించాలి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 18: బీసీ భవనాన్ని ప్రారంభించాలని తెలంగాణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సుంకు శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీలు అధికంగా ఉన్నారని, నూతనంగా నిర్మించిన బీసీ భవన్‌ను వినియోగంలోకి తెస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అక్కడే కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, నీరుకంటి నారాయణ, పొదిల శ్రీను, మురళి, కవిత తదితరులు పాల్గొన్నారు.

జీఎడవల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కనగల్, ఫిబ్రవరి 18: మండలంలోని జీఎడవల్లి ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 1992-93 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 31 ఏళ్ల తర్వాత చదువులమ్మ తల్లిఒడిలో వారంతా కలుసుకోవటంతో పాఠశాలలో పండగ వాతావరణం నెలకొంది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అంజిరెడ్డి, యాదగిరి, ఆశీర్వాదంను సమావేశంలో శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు దోటి కిషన్ ప్రసాద్, వేమిరెడ్డి భూపాల్‌రెడ్డి, ఉమాపతి, కారింగు సైదులుగౌడ్, పంతంగి సైదులు, సత్తయ్య, మన్యం శ్రీను, మునీర్, రాధ, సునీత, విజయ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థుల ప్రయాస

చండూరు, ఫిబ్రవరి 18: చండూరు మునిసిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాఠశాలకు ప్రహరీ గోడ ఉండేది. ఏడు నెలల క్రితం పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా దానిని తొలగించారు. ఆ తర్వాత నిర్మాణం చేపట్టడం లేదు. గోడ లేకపోవడంతో పాఠశాలలోకి రాత్రి సమయం లో మందుబాబులు ప్రవేశిస్తున్నారు. మద్యం తాగి ఖాళీ సీసాలను పగులగొడుతున్నారు. దీంతో ఉదయాన్నే వచ్చిన విద్యార్థులకు వాటి వలన గాయాలైన సంఘటనలు ఉన్నాయి. అంతేకాక ప్రహరీ లేకపోవడంతో పాఠశాల సమయంలో మేకలు, పందులు, కుక్కలు పాఠశాలలోకి వచ్చి సంచరిస్తున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు కోరుతున్నారు.


ప్రహరీ గోడ లేని జడ్పీ హైస్కూల్ భవనం

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడటౌన్: ఉచిత విద్య, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ డబ్బీకార్ మల్లేష్, సోషల్‌వర్కర్ డాక్టర్ రాజు అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని బకాల్‌వాడీ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రశ్నపత్రాలను టూటౌన్ ఎస్‌ఐ కృష్ణయ్యతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో కిరణ్ కుమార్, శ్రీను, సైదానాయక్, శ్రీనివాసరాజు, జగన్, వదూద్, సుమన్ తదితరులు పాలొన్నారు.

● జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో నరాల బలహీనతతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోపాలం శివన్నారాయణ, అక్కయ్య, రమణారెడ్డి, శోభ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిడమనూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి, ఎండోమెంట్ మంత్రి కొండా సురేఖలను కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు దూప, దీప, నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పగిడిమర్రి ప్రసాదశర్మ, ప్రధాన కార్యదర్శి రామడుగు వెంట్రామశర్మ, జిల్లా కోశాధికారి రామడుగు రామ్మూర్తి తెలిపారు. గౌరవ వేతన బకాయిలు, కనీస వేతనం, ఉద్యోగ భద్రత తదితర సమస్యల సాధన కోసం సీఎం, మంత్రిని కలువనున్నట్లు పేర్కొన్నారు. డీడీఎన్ అర్చక సంఘం నాయకులు చలో సెక్రెటేరియట్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాడ్గులపల్లి: సాగర్ నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన రైతులతో మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, భూగర్భజలాలు అడుగంటిపోవడం వల్ల బోరుబావులు తగ్గాయని, ప్రభుత్వం పది రోజులపాటు సాగర్ నీటిని విడుదల చేస్తే భూగర్భజలాలు పెరిగి రైతులు పంటలను కాపాడుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం వెంటనే నీటి విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట మల్లారెడ్డి, శ్రీకర్, వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనగల్: నల్లగొండ పట్టణంలో ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో దుర్మరణం పాలైన బొమ్మెపల్లి గ్రామానికి చెందిన దాసరి లక్ష్మమ్మ(మల్లీశ్వరి) కుటుంబ సభ్యులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణసాయం కింద మంత్రి ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ మృతురాలి భర్త కోటేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు బోగరి రాంబాబు, రమేష్, రమణారెడ్డి, చిర్రబోయిన యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చందంపేట: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. చందంపేట మండలం గాగిళ్లపూరం గ్రామంలో మహాగణపతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కేతావత్ శంకర్, జనార్ధన్‌రావు, కొండల్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ కల్చరల్: అయోధ్యనగరంలోని రామమందిరాన్ని నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని భక్తులు దర్శించుకునేందుకు ఈ నెల 20వ తేదీన భువనగిరి రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేకంగా ఆస్థా రైల్ సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించినట్లు బీజేపీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకు 1344 మంది భక్తులు రామమందిరాన్ని దర్శించుకునేందుకు టికెట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. టికెట్ బుక్ చేసుకున్న భక్తులు ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకే స్టేషన్‌కు చేరుకోవాలని, భక్తులు ఖరీదైన ఆభరణాలను వెంట తీసుకురావద్దని సూచించారు.

నార్కట్‌పల్లి: బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్ పిలుపునిచ్చారు. ఈ నెల 22న చిట్యాలకు యాత్ర చేరుకుంటున్న సందర్భంగా జనసమీకరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 2వేల మంది కార్యకర్తలను తరలించే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మద్యం మత్తులో ఇంటికి నిప్పు

● భార్యతో వివాదమే కారణం


కోయగూరవానిబావిలో ఎగిసిపడుతున్న మంటలు

గుర్రంపోడు, ఫిబ్రవరి 18: భార్యతో గొడవపడి మద్యం మత్తులో ఇంటికి నిప్పుపెట్టడంతో తన ఇంటితో పాటు పక్కన ఉన్న మరో మూడు ఇళ్లకు మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కోయగూరవానిబావి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముస్కు కుమార్ ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్యతో ఏర్పడి వివాదం గొడవగా మారింది. వివాదం పెరగడంతో అసహనంతో మద్యం మత్తులో ఇంటికి నిప్పంటించాడు. ఈ సంఘటనలో తన ఇంటితో పాటు పక్కన ఉన్న షేక్ షబానా, చొప్పరి ఎట్టయ్య, కట్టె శంకర్‌లకు చెందిన మరో మూడు ఇళ్లకు మంటలు వ్యాపించి అగ్నికి ఆహుతయ్యాయి. భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో గ్రామస్థులు మంటలను ఆర్పి ప్రమాద తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. సమయానికి అగ్నిమాపక సిబ్బంది రావడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ అగ్నిప్రమాదంలో లక్షల్లో ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. .